సాక్షి పెద్దపల్లి

గురువారం । 30 । మే । 2024



మల్లన్నకు పట్నాలు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.



నాగేపల్లి సందర్శన

మంథని: నాగేపల్లి గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత బుధవారం సందర్శించారు. నర్సరీ, క్రీడాప్రాంగణం, పల్లె ప్రకృతివనం పరిశీలించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.0/29.6

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర చిహ్నంపై సమీక్షకు హాజరు



సీఎం నివాసంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: తెలంగాణ రాష్ట్ర చిహ్నం తుదిరూపు తయారీ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారుడు రుద్ర రాజేశం, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, జేఏసీ నేత రఘు, సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమం, త్యాగాలను ప్రతిబింబించేలా రాష్ట్ర చిహ్నం రూపుదిద్దుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు.

ఉపాధి పనులకు హాజరు కావాలి

పాలకుర్తి(రామగుండం): గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులకు అర్హులైన కూలీలు, వారి కుటుంబసభ్యులు హాజరుకావాలని డీఆర్డీవో రవీందర్ కోరారు. జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోని డి-83కాలువలో పూడికతీతలో పాల్గొంటున్న కూలీలతో మాట్లాడారు. అనంతరం బసంత్‌నగర్ నర్సరీ సందర్శించారు. మొక్కల పెంపకంపై ఆరా తీశారు. వచ్చే హరితహారానికి అవసరమైన మొక్కలు, ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఏపీఎం కొమురయ్య, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, రవీందర్ పాల్గొన్నారు.

పాలకుర్తి ఎంపీపీగా రమేశ్



ధ్రువీకరణపత్రం అందిస్తున్న రవీందర్

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిగా పుట్నూర్ ఎంపీటీసీ గంగాధర రమేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఎంపీపీ వ్యాళ్ల అనసూర్యపై గతంలో ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిన నేపథ్యంలో కొత్త ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. దీంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాలకుర్తి, బసంత్‌నగర్, ఎల్కపల్లి, కొత్తపల్లి, పుట్నూర్ ఎంపీటీసీలు హాజరయ్యారు. రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఎంపీడీవో శశికళ, బసంత్‌నగర్ ఎస్సై స్వామి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. రమేశ్‌ను పలువురు అభినందించారు.

పద్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: సామాజిక సేవా రంగాల్లో విశేష కృషి చేసినవారి నుంచి పద్మ పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సురేశ్ తెలిపారు. ఇందుకోసం జూన్ 3లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, ప్రజావ్యవహారాలు, పౌరసేవ, వాణిజ్య పరిశ్రమలు తదితర వాటిలో చేసిన కృషి, సాధించిన లక్ష్యాలను 800 పదాలు మించకుండా రాసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను సంబంధిత పత్రాలతో 4 సెట్‌లను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఆయన సూచించారు.

వైభవంగా బీరన్న పట్నాలు




మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

జూలపల్లి(పెద్దపల్లి): మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న బీరన్న, కమరాతి కల్యాణోత్సవంలో బుధవారం నాగవెల్లి ఉత్సవం జరిగింది. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మొక్కులు చెల్లించారు. అలాగే బీజేపీ రాష్ట్ర నాయకుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత నల్ల మనోహర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల మాజీ చైర్మన్ దారబోయిన నర్సింహయాదవ్, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. మహంకాళి బీరన్న కురుమ సంక్షేమ సంఘం సభ్యులు లచ్చయ్య, మల్లేశం, శంకర్, రమేశ్, పొట్టాల మల్లేశం, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

శుచిలేదు.. శుభ్రత పట్టదు నిఘా పటిష్టం

- హోటళ్లలో నాసిరకం ఆహార పదార్థాలు
- అపరిశుభ్ర పరిసరాల్లోనే వంటల తయారీ
- నిల్వ చేసిన మాంసం, పదార్థాలతో వంటకాలు
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- ప్రజల ఆరోగ్యంతో నిర్వాహకుల చెలగాటం

సాక్షి ఫోకస్



ఈచిత్రంలో కనిపిస్తున్నది రామగుండంలోని ఓ రెస్టారెంట్ కిచెన్. శుచి, శుభ్రత లోపించాయి. అపరిశుభ్ర వాతావరణంలోనే వంటలు వండుతున్నారు. నాసిరకం ఆహార పదార్థాలను వినియోగదారులకు అందిస్తున్నారు. వంటపాత్రలు, భోజనం చేసే ప్లేట్లు, నీళ్లుతాగే గ్లాస్‌లు చూద్దామన్నా శుభ్రంగా కనిపించడంలేదు. ఇలాంటి విషయాల్లో కస్టమర్లకు, నిర్వాహకులకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. అయినా, పట్టించుకునేనాథుడే కరువయ్యాడు.

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని చిన్న హోటళ్ల నుంచి పెద్ద రెస్టారెంట్ల వరకు, స్వీట్ హోంల నుంచి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వరకు ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. చాలా రోజుల పాటు నిల్వ చేసిన పదార్థాలు, గడువు మీరిన, కల్తీ నూనెలతో వంటలు తయారు చేస్తూ నిర్వాహకులు కస్టమర్లకు వడ్డిస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ చేసే గదులు కంపు కొడుతున్నాయి. దీర్ఘకాలం పాటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు, కార్పొరేషన్, మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడమే ఇందుకు కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదో ఫిర్యాదు అందితే తప్ప.. అది కూడా తూతూమంత్రంగా తనిఖీల పేరిట ఫుడ్‌సేఫ్టీ అధికారులు అప్పుడప్పుడు చుట్టపు చూపులా వచ్చిపోతున్నారని, అంతేకాదు.. శాంపిళ్ల సేకరణతోనే సరిపెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

నిల్వ చేసిన మాంసంతో వంటలు

- ప్రజావసరాలను ఆసరాగా చేసుకొని కొందరు నిర్వాహకులు చేస్తున్న వ్యాపారంలో నిబంధనలు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.
- ఆహార పదార్థాల తయారీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.
- మిగిలిన, నిల్వచేసిన మటన్, చికెన్, ఇతర ఆహా పదార్థాలను డీఫ్ ఫ్రిజ్‌లో నిల్వ చేస్తూ మరుసటిరోజు కస్టమర్లకు వడ్డిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.
- నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాల్లో రంగులు కలుపుతూ కేన్సర్, గుండెజబ్బుల వంటి ప్రాణాంతకమైన వ్యాధులకు కారణమవుతున్నారని మరోవైపు వైద్యులు చెబుతున్నారు.
- కొందరు యజమానులు ట్రేడ్, ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ లేకుండానే హోటళ్లను యథేచ్ఛగా నడిపిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి.
- మరికొందరైతే మాంసం విక్రయాలు చేసేవారితో బేరం కుదుర్చుకుని వ్యాధులతో చనిపోయిన, గాయాలపాలైన మేకలు, గొర్రెలు, కోళ్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి వంటలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అంతటా అపరిశుభ్రతే

జిల్లాలోని అనేక హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలోని వంటగదులు పరిశుభ్రంగా లేవు. వంటపాత్రలు శుభ్రం చేసేందుకు ప్రత్యేక చాంబర్లు ఏర్పాటు చేయలేదు. ఒకవేళ ఉన్నా.. నీటితోనే వంటపాత్రలను పైపైనే శుభ్రం చేస్తూ వాటిలోనే వినియోగదారులకు ఆహారపదార్థాలు వడ్డిస్తున్నారు. టేబుళ్లను క్లీన్‌చేసే సమయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ ప్లేట్లు, గ్లాసులను రెండు బకెట్ల నీళ్లలో ముంచేసి శుభ్రం చేయడంతోనే పనికానిచ్చేస్తున్నారు. వంటమాస్టర్లు, సర్వర్లు ఆప్రాన్స్, క్యాపులు, గ్లౌస్‌లు ధరించడం లేదు. కొన్నిరోజుల పాటు నిల్వచేసిన మాంసం, చట్నీ, వంటి వాటినే నూనెలో వేసి మళ్లీ ఫ్రైచేసి వడ్డిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో పట్టుబడినా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్నదీ లేదు. శాంపిళ్ల సేకరణలో తప్పనితేలితే జరిమానా, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని దుకాణ యజమానులు, వ్యాపారులకు హెచ్చరికలు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇదేవిషయమై ఆహార తనిఖీ అధికారిని వివరణ కోరగా ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత హోటళ్లలో తనిఖీలు చేస్తున్నామన్నారు. నిబంధనలు పాటించకపోతే జరిమానాలు విధిస్తున్నామని ఆయన తెలిపారు.

- జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు
- నకిలీ, కల్తీ విత్తనాల కట్టడికి చర్యలు

పెద్దపల్లిరూరల్: వానాకాలం సాగుకు సమాయత్తమవుతున్న రైతులు నకిలీ, కల్తీ విత్తనాలతో నష్టపోకుండా జిల్లా ఉన్నతాధికారులు టాస్క్‌ఫోర్స్ బృందాలతో నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. అక్రమార్కులపై నిఘా పెంచారు. దుక్కులు దున్ని విత్తనాలు, ఎరువులను సిద్ధ చేసుకునే పనిలో పడ్డ అన్నదాతలు.. విత్తన ఎంపికలో మోసపోకుండా పాటించాల్సిన పద్ధతులపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఊరూరా సమావేశాలు నిర్వహిస్తూ కర్షకులను అప్రమత్తం చేస్తున్నారు.

సాగు విస్తీర్ణం 2.78లక్షల ఎకరాలు..

- జిల్లాలో ఈ వానాకాలంలో దాదాపు 2.78లక్షల ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు.
- ఇందులో అగ్రస్థానంలో వరి 2.10లక్షల ఎకరాలు, ఆ తర్వాతి స్థానంలో పత్తి 58వేల ఎకరాల విస్తీర్ణంలో సాగవుతుందని అధికారులు భావిస్తున్నారు.
- మిగతా విస్తీర్ణంలో ఆయిల్‌పాం, ఇతర అపరాలు సాగయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు.
- అయితే, సాగుకు అవసరమైన విత్తన ఎంపికలో రైతులు మోసపోయే ప్రమాదముందని భావించిన అధికారయంత్రాంగం.. నకిలీ, కల్తీ విత్తనాల కట్టడికి టాస్క్‌ఫోర్స్ బృందాలతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తోంది.

పత్తి విత్తనాలతోనే మోసం..

అధిక దిగుబడి వస్తుందని పొరుగు జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలువురు వ్యాపారులు, దళారులు రైతులను నమ్మించి నకిలీ, కల్తీ పత్తి విత్తనాలను అంటగట్టి మోసం చేస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లాలో వరి, పత్తి సాగుకే అన్నదాతలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బీటీ- 3 రకం పత్తి విత్తనాలను నిషేధించినా కొందరు వ్యాపారులు అడ్డదారుల్లో తెచ్చి రైతులకు అంటగడుతున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో అలివేణి

అవగాహన కల్పిస్తున్నాం

> విత్తన ఎంపికలో రైతులు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. ఇదే సమయంలో నకిలీ, కల్తీ విత్తనాలను అంటగట్టేందుకు అక్రమ మార్గాల్లో వచ్చే వ్యాపారులను గుర్తిస్తాం. ఇందుకోసం టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నాయి.
> – ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

రైతులకు అవగాహన..

- వానాకాలంలో సాగుకు సిద్ధమైన రైతులు.. విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.
- నకిలీ విత్తనాల బారినపడి నష్టపోకుండా అప్రమత్తం చేసేలా (ఈనెల25) శనివారం నుంచి ఊరూరా గ్రామసభలు నిర్వహిస్తున్నారు.
- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజాప్రతినిధులను ఇందులో భాగస్వాములను చేయడం లేదని, జూన్ 5 తర్వాత వారిని కూడా భాగస్వాములను చేసే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు.

సమయపాలన ఏది?



ఉద్యోగులు, అధికారులు లేక బోసిపోయి కనిపిస్తున్న కుర్చీలు



బోసిపోతున్న శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాలు

రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఉదయం 11గంటలు దాటినా.. శానిటేషన్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ తదితర విభాగాల్లోని కుర్చీలు అధికారులు, సిబ్బందిలేక బోసిపోయి కనిపిస్తున్నాయి. అధికారులను కలుసుకోవడానికి బల్దియా కార్యాలయానికి వస్తున్న సందర్శకులు.. ఖాళీ కుర్చీలను చూసి వెనుదిరిగి పోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నామని చెబుతున్నారు. కానీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నక్రమంలో కొత్త పనులు ప్రారంభం కావడంలేదు. ఇప్పటికే పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కావడంలేదు. దీంతో కాంట్రాక్టర్లు కొత్త పనులు నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో ఉండకుండా, కార్యాలయంలో ఉండకుండా ఎక్కడ ఉంటున్నారో? అని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు.

– కోల్‌సిటీ(రామగుండం)

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

- జిల్లా అదనపు సెషన్స్ జడ్జి సాధన



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాధన

జ్యోతినగర్(రామగుండం): పట్టుదల ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని కరీంనగర్ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి డి.సాధన అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సందర్శన తర్వాత ఆమె పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని బాలికా సాధికారత మిషన్-2024 శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు వేసవిలో వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్న ఎన్టీపీసీ, సీఎస్సార్-సీడీ బృందాన్ని జడ్జి అభినందించారు. శిక్షణ పొందిన బాలికలు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఇది మంచిమార్గమని అన్నారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు మాట్లాడుతూ, ఎన్టీపీసీ ప్రభావిత, పునరావాస గ్రామాల అభివృద్ధితోపాటు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం జడ్జి సాధనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్‌తోపాటు అధికారులు, బాలికలు, జెమ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ రక్తదాత ఎంపికకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాకు చెందిన రక్తదాతల్లో ఈఏడాది మే ఆఖరు నాటికి 40 కన్నా ఎక్కువసార్లు రక్తదానం చేసిన వారినుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ బుధవారం తెలిపారు. జూన్ 14న అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా 40 సార్లకన్నా ఎక్కువసార్లు రక్తదానం చేసిన దాతలను హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో సన్మానిస్తారని ఆయన పేర్కొన్నారు. రక్తదాన సమయంలో దాతలు తీసుకున్న ఫొటోలు, పేపర్ క్లిప్పింగులను సంబంధిత రక్తదాన శిబిరం వారందించిన సర్టిఫికెట్లను సాదుల వెంకటేశ్వర్లు, సెల్ నంబరు 98498 90646, అంజనీకుమార్, సెల్ నంబరు 99089 74000, తూం రవీందర్, సెల్ నంబరు 98499 65411కు ఈనెలాఖరులోగా వాట్సాప్ చేయాలని ఆయన సూచించారు.

2న సెలవు దినంగా ప్రకటించాలి

గోదావరిఖని: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవమైన జూన్-2న ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. అనేక దశాబ్దాల పోరాటాలు, నిరసనలు, ఆందోళనలు, ఉద్యమాల తర్వాత సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుమతించారని తెలిపారు. దీంతో జూన్-2న వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మద్దతుగా 60వేల మంది సింగరేణి బొగ్గుగని కార్మికులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, న్యాయవాదులు, విద్యుత్‌బోర్డు ఉద్యోగులు, సకలజనుల సమ్మెలో పాల్గొన్నారని ఆయన గుర్తుచేశారు. ఇంతటి చారిత్రాత్మక పోరాటం, ఉద్యోగుల త్యాగాలను గుర్తించి జూన్-2వ తేదీన ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని ఆయన కోరారు.

కల.. సాకారమయ్యేలా..

- ఆలోచనలకు పదును
- భవిష్యత్‌కు బంగారు బాటలు
- బాలికా సాధికారతకు ఎన్టీపీసీ పెద్దపీట
- 113 మంది విద్యార్థినులకు వివిధ రంగాల్లో శిక్షణ



యోగా సాధనలో బాలికలు



చిత్రలేఖనంలో తర్ఫీదు ఇస్తున్న ట్రెయినర్లు

జ్యోతినగర్(రామగుండం): దేశానికి వెలుగులు ప్రసరింపజేస్తున్న ఎన్టీపీసీ.. సామాజిక సేవా బాధ్యత పథకం(సీఎస్సార్) ద్వారా తమ పరిధిలోని బాలికల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిద్దేందుకు కంకణం కట్టుకుంది. ఇందుకోసం సంస్థ ప్రభావిత, పునరావాస ప్రాంతాలైన అంతర్గాం, పాలకుర్తి, రామగుండం, కమాన్‌పూర్ మండలాలకు చెందిన 29 ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తిచేసిన 113 మంది బాలికలకు బాలికా సాధికారత మిషన్-2024 ద్వారా వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'భేటీ బచావో.. భేటీ పడావో'కు మద్దతుగా ఈ కార్యక్రమం అమలు చేస్తోంది. రామగుండం ప్రాజెక్టు పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని శ్రీచైతన్య కళాశాల భవనంలో ఈనెల 2న శిక్షణ శిబిరం ప్రారంభించింది. 17న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శిబిరాన్ని సందర్శించి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. జూన్ ఒకటో తేదీన శిబిరం ముగుస్తుంది.

లక్ష్యం ఇదే..

- బాలికల్లో వ్యక్తిగత పరిశుభ్రత, సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన
- శారీరక సమస్యలు, ఇంటర్నెట్, మొబైల్ వినియోగం, సైబర్ నేరాల తీరుపై శిక్షణ.
- గొప్ప కలలు కనడం, వాటిని సాకారం చేసుకోడం, ఆలోచనలకు పదును పెట్టడం
- జీవితంలో సమున్నత లక్ష్యం చేరుకోవాలనే ఆలోచన, తపన కల్పించడం
- సరళమైన తెలుగు, ఆంగ్ల భాషలపై పట్టు, యోగా, గణితశాస్త్రంలో ప్రాథమిక సూత్రాలు, మెలకువలు, పర్యావరణశాస్త్రం, ఆత్మరక్షణ, క్రీడలు, కంప్యూటర్స్ వినియోగం, పౌష్టికాహారం ద్వారా ఉపయోగాలు, 5 ఎస్.విధానాలు

శిక్షణ ఇలా ఇస్తున్నారు..

- కంప్యూటర్, ఇంటర్నెట్, మొబైల్‌ఫోన్ల ద్వారా జరిగే సైబర్ నేరాలపై అవగాహన విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.
- సామూహిక చర్చలు, సదస్సుల్లో పాల్గొనేలా విద్యార్థినులను తీర్చి దిద్దుతున్నారు.
- సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, నాటకరంగం
- మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

తీసుకుంటున్న జాగ్రత్తలు

- వసతి గృహం వద్ద 24 గంటలపాటు మహిళా సెక్యూరిటీ గార్డులతో కాపలా
- ప్రత్యేకంగా శిక్షణ పొందిన మహిళా వార్డెన్లు
- కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ
- సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా.

యోగా నేర్చుకుంటున్న



శిబిరంలో ఉచితంగా యోగా నేర్చుకుంటున్న. మాకు మంచి భోజనం పెడుతున్నరు. వసతి కల్పించిండ్రు. దుస్తులు అందించారు. అన్ని సౌకర్యాలు బాగున్నయి. ఎన్ని డబ్బులు పెట్టినా అందని అవకాశం మాకు ఎన్టీపీసీ ఉచితంగాకల్పించింది.
– ఎస్తేరి, బసంత్‌నగర్

కంప్యూటర్‌పై ఆసక్తి



సమ్మర్ శిక్షణ శిబిరంలో పేరు నమోదు చేసుకున్న. నాకు కంప్యూటర్‌పై ఆసక్తి ఉంది. కంప్యూటర్ విద్య నేర్చుకుంటున్న. డ్యాన్స్ అంటే కూడా చాలా ఇష్టం. శిబిరంలో నెలరోజుల శిక్షణలో కంప్యూటర్, డాన్స్ నేర్చుకుంట.
– శ్రుతి, సుభాష్‌నగర్

డ్యాన్స్ అంటే ఇష్టం



పొద్దున్నే నిద్ర లేస్త. ఆ తర్వాత యోగా, కరాటే నేర్పిస్తున్నరు. నేను వీటిలో శిక్షణ పొందుతున్న. డ్యాన్స్ టీచర్ చాలాబాగా నేర్పిస్తున్నరు. శిబిరం చాలా ఉపయోగంగా ఉంది. భవిష్యత్‌లో ఎంతోఉపయోగపడుతుంది.
– అలేఖ్య, గాంధీ పార్క్ స్కూల్, గోదావరిఖని

ఇది మా అదృష్టం



ఎన్టీపీసీ డబ్బులు ఖర్చుచేసి మాకు శిక్షణ ఇవ్వడం మా అదృష్టంగా భావిస్తున్నం. సర్కార్ స్కూల్ బాలికలకు శిక్షణ అందించి ప్రోత్సహిస్తున్నరు. ఇక్కడ పొందుతున్న శిక్షణ భవిష్యత్‌లో ఉపయోగడపతుంది.
– మన్మిత, లక్ష్మీపురం

ఎన్టీపీసీ సీఎస్సార్ అండ



బాలికా విద్యను ప్రోత్సహించడానికి ఎన్టీపీసీ సామాజిక సేవా బాధ్యతా పథకం ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నాలుగు వారాల పాటు రెసిడెన్షియల్ విధానంతో అత్యుత్తమ నిపుణులతో బోధిస్తున్నాం. బాలికల అభిరుచి మేరకు ఆయా రంగాల్లో శిక్షణ ఇస్తున్నాం. ఎన్టీపీసీలోని ఐసీఏహెచ్ క్యాంటీన్ ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నాం.
– బిజయ్ కుమార్ సిగ్దర్, ఏజీఎం, ఎన్టీపీసీ

పూలబాట వేస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికల భవిష్యత్‌కు వెలుగు పూలబాట వేసేందుకు బాలికా సాధికారత మిషన్-2024 ప్రారంభించాం. ఇందుకోసం సీఎస్సార్ నిధులు వెచ్చించాం. టైమ్స్ నా సంస్థ పర్యవేక్షిస్తోంది. చిన్నవయసులోనే బాలికల్లోని ప్రతిభ వెలికితీసి ఉత్తములుగా తీర్చిదిద్దుతాం. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 10 మంది విద్యార్థినులకు ఇంటర్మీడియెట్ వరకు ఉచిత విద్య అందిస్తాం.
– కేదార్ రంజన్ పాండు, ఈడీ, ఎన్టీపీసీ

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం



ఎన్టీపీసీ పరిధిలోని 113 మంది బాలికలను మూడు బ్యాచ్‌లుగా విభజించాం. ఒక్కో బ్యాచ్‌కు ప్రత్యేకంగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇస్తున్నాం. చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు ఆసక్తి ఉన్న అంశాలపై వారికి తర్ఫీదు ఇప్పిస్తున్నాం.
– రూపాలి రంజన్, కార్పొరేట్ కమ్యూనికేషన్ ఎగ్జిక్యూటివ్, ఎన్టీపీసీ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కరీంనగర్‌క్రైం: కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు చికిత్స పొందుతూ చనిపోయారు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడ్పుల గ్రామానికి చెందిన భానుప్రకాశ్‌రెడ్డి(21) కుటుంబం ప్రస్తుతం కొత్తపల్లి మండలం చింతకుంటలో నివాసం ఉంటున్నారు. భానుప్రకాశ్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. మంగళవారం స్నేహితులను కలిసేందుకు కరీంనగర్ వచ్చాడు. నగరంలోని హనుమాన్‌నగర్‌లో నివసించే చొప్పరి రిత్విక్, మరో ఇద్దరు స్నేహితులను కలిశాడు. రాత్రి ఒంటిగంట సమయంలో రిత్విక్, భానుప్రకాశ్‌రెడ్డి బైక్‌పై మంకమ్మతోట ప్రధాన రోడ్డు వైపు వెళ్తుండగా.. కొత్త లేబర్ అడ్డా సమీపంలో కుక్క అడ్డువచ్చింది. బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో భానుప్రకాశ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడ్డ రిత్విక్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం


అభిషేక్ మృతదేహం

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం చెరువులో గల్లంతయిన అభిషేక్ మృతదేహాన్ని వెలికితీశారు. జిల్లా కేంద్రంలోని వాణినగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, లావణ్య కుమారుడు అభిషేక్ తమ బంధువులతో కలిసి అంతర్గాం చెరువుకు ఈతకు వెళ్లారు. ఈత రాకపోవడంతో అభిషేక్ మృతి చెందాడు. అప్పటికే రాత్రి కావడంతో అభిషేక్ మృతదేహం లభ్యం కాలేదు. బుధవారం కూడా గాలింపు చర్యలు చేపట్టగా శవం కనిపించింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


కనకవ్వ(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం గూడెంకు చెందిన కుతాడి కనకవ్వ(40) ఈనెల 20న తన కుమారుడు పర్శరాములుతో కలిసి ముస్తాబాద్‌కు బైక్‌పై వెళ్లింది. నామాపూర్ క్రాసింగ్ వద్దకు రాగానే బైక్ వెనుక టైరులో కనకవ్వ చీర చిక్కుకుని కింద పడిపోయింది. ఈ సంఘటనలో కనకవ్వకు తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కనకవ్వ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. కనకవ్వకు భర్త చంద్రం, కుమారుడు పర్శరాములు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవంపల్లికి చెందిన యువకుడు..

మానకొండూర్: మండలంలోని దేవంపల్లికి చెందిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. చీకట్ల వెంకటేశం(29) కరీంనగర్ వీడియో మిక్సింగ్ షాపులో పనిచేస్తూ జీవనం గడిపేవాడు. వ్యాపారంలో నష్టం రావడంతో మానసికంగా బాధపడుతూ కొద్ది నెలలుగా ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని, మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజుకుమార్ తెలిపారు.

ఆన్‌లైన్ ఆటలు.. ఆర్థికంగా కుదేలు

- అప్పులపాలు.. ఆత్మహత్యలు
- చితికిపోతున్న యువత
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పరువుపోతుందని కేసులు పెట్టని వైనం



వేములవాడ: అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను కొందరు మంచికి వినియోగించుకుంటే.. మరికొందరు ఆన్‌లైన్‌గేమ్స్ ఆడుతూ అధఃపాతాళానికి పోతున్నారు. క్రమంగా ఆన్‌లైన్ ఆటలకు అలవాటు పడిన యువత ఎవరిమాట వినకుండా తయారవుతున్నారు. లక్షల రూపాయలు నష్టపోయి పెద్దలకు చెప్పుకోలేక కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. మరికొందరు తల్లిదండ్రుల ఖాతాల్లో నుంచి దొంగతనాన తీసుకొని అప్పులు చెల్లిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఇటీవల పెరిగిపోయాయి.

నిత్యం ఆన్‌లైన్‌లో..

అండ్రాయిడ్ ఫోన్లు, అన్‌లిమిటెడ్ డాటా ఉండడంతో ఎవరిని చూసిన నిత్యం ఆన్‌లైన్‌లోనే ఉంటున్నారు. రమ్మి, క్యాసినో.. తదితర కొత్తకొత్త పేర్లతో అట్రాక్ట్ చేస్తున్న ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ లక్షల్లో నష్టపోతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా చేతిలో ఫోన్‌తోనే గడుపుతున్నారు. ఇలా అలవాటుపడ్డ వాళ్లలో కొందరి మానసిక స్థితి సరిగ్గా లేకుండా పోయింది. మరికొందరైతే పెద్దల మాటలకు ఎదురుచెప్పడం, కుటుంబ సభ్యులపై దాడి చేయడం వంటి స్థితికి చేరుకుంటున్నారు.

లాభాలు వస్తున్నాయనే ఆశతో..

అప్పుడప్పుడే ఆన్‌లైన్ గేమ్స్ మొదలుపెట్టిన వారికి మొదటల్లో చిన్నపాటి లాభాలు ఆశచూపుతారు. ఇలా ఆ గేమ్స్‌కు ఆకర్షితులను చేసి క్రమంగా డబ్బులు గుంజుతుంటారు. జిల్లాలో ఇలా ఆన్‌లైన్ గేమ్స్ ఆడి కుదేలైన కుటుంబాలు అనేకం ఉన్నాయి. అయితే ఇలా నష్టపోయిన కుటుంబాలకు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనకాడుతున్నాయి. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో ఫిర్యాదు చేయడం లేదు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడి నష్టపోయిన వారు ఇలా..

- వేములవాడకు చెందిన ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రైల్వేశాఖలో విధులు నిర్వర్తించేవాడు. సహచరులతో ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి ఉన్న ఆస్తిని పోగొట్టుకున్నాడు. అప్పుల పాలు కావడంతో మానసికంగా కుంగిపోయి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు రోడ్డున పడ్డారు.
- ఇటీవల వేములవాడలో రూ.2కోట్లతో ఉడాయించిన పూజారి మహేశ్ కూడా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడ్డట్లు సన్నిహితుల ద్వారా తెలిసింది. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నాడని స్నేహితులు తెలిపారు.
- వేములవాడకు చెందిన యువకులు రాజు, వెంకటేశ్, రమణ, శ్రీనివాస్.. ఆన్‌లైన్ గేమ్ పేరుతో క్యాసినో తదితర ఆటలవైపు మొగ్గుచూపారు. దాదాపు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నష్టపోయారు.

అవగాహన కల్పిస్తున్నాం

ఆన్‌లైన్ గేమ్స్, సైబర్‌క్రైమ్‌లపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. కళాబృందాల ద్వారా గ్రామీణులను చైతన్యం చేస్తున్నాం. యువత ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కావడం సమాజానికి మంచిది కాదు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. స్కిల్ గేమ్స్ మాత్రమే ఆడాలి. అధిక డబ్బులు వస్తాయని ఆశ చూపే ఏ గేమ్ కూడా వాడొద్దు. అలాంటి గేమ్స్ వాడితే ఆర్థికంగా నష్టపోతారు. ఇలా ంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలి.

– నాగేంద్రచారి, వేములవాడ డీఎస్పీ

ఒలింపిక్ సంఘం ఎన్నికల బరిలో జనార్దన్‌రెడ్డి

- సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్


నామినేషన్ పత్రాలు అందిస్తున్న జనార్దన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గానికి ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 25న విడుదలైంది. నామినేషన్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి పదవికి నామినేషన్ దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని ఒలింపిక్ భవన్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మాజీ జడ్జి సి.ప్రవీణ్ కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందించారు. జూన్ 9న జరుగనున్న తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పెద్దపెల్లి జిల్లా జూడో సంఘం ప్రధాన కార్యదర్శి సిలివేరి మహేందర్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల దందాపై ఉద్యమించండి


మాట్లాడుతున్న రాజు నాయక్

కరీంనగర్: ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లపై ఉద్యమించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజు నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో జరిగిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, ఫైర్ సేఫ్టీ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనుమతి లేకుండా ప్రైవేట్ విద్యాసంస్థలు వెలుస్తున్నాయన్నారు. వి ద్యార్థులకు సరైన క్రీడా మైదానం, అపార్ట్‌మెంట్ లాంటి భవనాల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారన్నారు. విచ్చలవిడిగా టెక్నో, కాన్సెప్ట్, ఎక్స్‌ప్లోరికా, వరల్డ్, ఐఐటీ, జేఈఈ, సీబీఎస్‌ఈ వంటి రకరకాల తోక పేర్లను పెట్టి ఆకర్షించేలా ప్రచారాలు చేస్తూ ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్‌స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని వారిపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల హాస్టళ్ల ఆగడాలపై ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సత్యంనాయక్, జిల్లా కార్యదర్శి మోతిలాల్, తిరుపతి నాయక్, కృష్ణ నాయక్, సక్రు నాయక్, వీరన్న నాయక్, శ్రీను నాయక్, జోహార్ లాల్‌నాయక్, భీమానాయక్, హర్యానాయక్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో హుండీ చోరీ


హుండీ ధ్వంసం చేస్తున్న దొంగ(సీసీ ఫుటేజీ)

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ అయ్యప్పస్వామి ఆలయ హుండీని బుధవారం తెల్లవారుజామున దొంగ పగులగొట్టాడు. అందులోని సొమ్ము అపహరించాడు. రాజీవ్ రహదారి పక్కనే ఉన్న ఆలయంలో జరిగిన హుండీ చోరీకి యత్నించిన దృశ్యాలు గల వీడియో, ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. నిందితుడి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఎస్సై మల్లేశ్ కోరారు.

గ్యాస్ ఏజెన్సీపై కేసు


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రికార్డులు సరిగా నిర్వహించడం లేదంటూ గోదావరిఖనిలోని ఓ వంట గ్యాస్ ఏజెన్సీపై అధికారులు కేసు నమోదు చేశారు. పెద్దపల్లి డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గోదావరిఖని శివాజీనగర్‌లోని రవితేజ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు సరిగా నిర్వహించడం లేదని గుర్తించారు. నిల్వల్లోనూ వ్యత్యాసం ఉందని తేల్చి కేసు నమోదు చేసినట్లు డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వేడెక్కిన రైల్వేట్రాక్


రైల్వేట్రాక్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

రామగుండం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని రైల్వేట్రాక్‌లు ఎండల తీవ్రతత వేడెక్కుతున్నాయి. ఈక్రమంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో రైల్వేట్రాక్‌పై 58 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈనెల 4, 5వ తేదీల్లోనూ గరిష్ఠంగా 59, ఈనెల 3, 6వ తేదీల్లో 58 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుత వాతావరణ మార్పులతో 50–54 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వివరించారు. రైల్వేట్రాక్ వేడెక్కడంతో కార్మికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పనివేళల్లో మార్పులు చేసినా.. ఉదయం 8గంటల నుంచే రైల్వేట్రాక్‌పై 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొంటున్నారు. కాంట్రాక్టరు మానవతా దృక్పథంతో ఆలోచించి పనిస్థలాల్లో కనీసం టెంట్ సౌకర్యం కల్పించాలని, చల్లటి తాగునీరు అందుబాటులో ఉంచాలని, షూస్, టోపీలు, ఓఆర్‌ఎస్‌లు అందజేయాలని, మేలో ప్ర త్యేక ఇన్సెంటివ్ చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు.

మరిమడ్లలో దొంగతనం

కోనరావుపేట(వేములవాడ): రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్లలో బుధవారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన చింతలపల్లి సుమన్ రాత్రి వేళ కుటుంబసభ్యులతో కలిసి మేడపైన పడుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 3 జతల కమ్మలు, ఒక జత మాటీలు, 12 తులాల వెండి గొలుసులు, తులంన్నర బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గట్టెపల్లిలో ట్రాక్టర్ చోరీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గట్టెపల్లి గ్రామంలోని గోస్కుల ఓదెలకు చెందిన ట్రాక్టర్ మంగళవారం రాత్రి చోరీకి గురైయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తన ఇంటి ముందు ట్రాక్టర్ పార్కింగ్ చేశాడు. ఆ తర్వాత కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన బంధువును చూసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. ట్రాక్టర్ కనబడకపోవడంతో బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

యువకుడి అదృశ్యం


అబ్దుల్‌రవూఫ్

గోదావరిఖని: స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రవూఫ్(30) మంగళవా రం ఇంట్లో నుంచి వెళ్లి తిరి గి రాలేదని వన్‌టౌన్ పోలీ సులు తెలిపారు. రాత్రి రెండు గంటల సమయంలో కుటుంబ సభ్యులతో గొడవపడి మోటార్ సైకిల్‌పై బయటకు వెళ్లాడని పేర్కొన్నారు. తండ్రి మొహినుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. యువ కుని ఆచూకీ తెలిస్తే వన్‌టౌన్ సీఐ 87126 56516, ఎస్సై శ్రీనివాస్ 90100 72555 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

మార్కులు తక్కువ వచ్చాయని..


మానస(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): నాయకంపల్లి తండాకు చెందిన మైనేని మానస(15) పదో తరగతిలో మార్కులు తక్కువగా వచ్చా యని మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 6.3 జీపీఏ వచ్చిందని కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉంటోంది. జీవితంపై విరక్తితో బుధవారం ఇంట్లో లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


రన్నరప్ ఉమ్మడి కరీంనగర్ టీ20 క్రికెట్ జట్టు

హెచ్‌సీఏ టీ20 రన్నరప్ కరీంనగర్

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీ20 క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ టీ20 జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఉప్పల్ స్టేడియంలో బుధవారం మెదక్ జిల్లా జట్టుతో జరిగిన ఫైనల్‌లో జిల్లా జట్టు ఓటమి చెంది రన్నరప్‌గా నిలిచింది. ఉమ్మడి జిల్లా జట్టును జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్ రావు, ఉపాధ్యక్షుడు మహేందర్‌గౌడ్, టీం మేనేజర్ మనోహర్ రావు అభినందించారు.

మాయా‘లేడీ’వలలో సింగరేణి అధికారి

- 8తులాల బంగారం, నగదు, సెల్‌ఫోన్లతో యువతి పరార్

గోదావరిఖని: ప్రియుడితో కలిసి ఓ యువతి సింగరేణి అధికారిని ట్రాప్ చేసి భారీమొత్తంతో పట్టుకుని ఉడాయించినట్లు గోదావరిఖనిలో ప్రచారం జరుగుతోంది. రామగుండం రీజియన్‌లోని సింగరేణి అధికారి ఒకరిని ఓ యువతి మాయమాటలతో తన ట్రాప్‌లోకి దింపినట్లు సమాచారం. తొలుత ఆ యువతి సదరు అధికారి ఇంటికి వెళ్లినట్లు, దీనిగురించి తన ప్రియుడికి ముందే సమాచారం అందించినట్లుగా తెలుస్తోంది. ఆమె వెళ్లిన కొద్దిసేపటికే ప్రియుడు ఆ అధికారి ఇంటికి వెళ్లి బ్లాక్‌మెయిల్ చేసి బెదిరించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈక్రమంలో అధికారి నుంచి 8తులాల బంగారం, కొంత నగదు, నాలుగు సెల్‌ఫోన్లతో యువకుడు, యువతి పరారైనట్లు సమాచారం. ఈవిషయంలో సదరు అధికారి పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలో ఈవిషయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

వృద్ధురాలి హత్య కేసులో జీవితఖైదు

గోదావరిఖనిటౌన్: రామగుండం ముబారక్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు సమ్మెట బాలమ్మ హత్య కేసులో అదేకాలనీకి చెందిన నగునూరి నరేశ్‌కు జీవిత ఖైదు విధిస్తూ గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. సమ్మెట తిరుపతిపై పాత కక్షలను దృష్టిలో పెట్టుకొన్న అదే కాలనీకి చెందిన నగునూరి నరేశ్.. 2019 మార్చి ఒకటో తేదీన సమ్మెట తిరుపతి తల్లి బాలమ్మను గొడ్డలితో నరికి చంపివేశాడు. తిరుపతి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై దత్తాత్రి కేసు నమోదు చేశారు. సీఐ, ప్రస్తుత ఆర్పీ ఇన్‌స్పెక్టర్ స్వామి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ అజయ్‌బాబు, ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో 14మంది సాక్ష్యులను కోర్టు డ్యూటీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కోర్టు లైజన్ ఆఫీసర్ శంకర్ కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు జిల్లా న్యాయస్థాన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జ్యోతిరెడ్డి తన వాదనలు వినిపించారు. అయితే, నగునూరి నరేశ్‌పై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

హమ్మయ్యా.. చిక్కిన గంజాయి నిందితుడు

- ముంబైలో పట్టుకున్న పోలీసులు


రత్న విలాస్

చందుర్తి(వేములవాడ): నెల రోజుల క్రితం చందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకొని పరారైన గంజాయి నిందితుడు ముంబైలో దొరికాడు. చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు. గత నెల 29న చందుర్తి మండలం మర్రిగడ్డ శివారులో గంగాధర్ మండలం గర్షకుర్తికి చెందిన రత్న విలాస్ గంజాయితో పట్టుబడ్డాడు. అదే రాత్రి చందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి పరారయ్యాడు. ఈ విషయాన్ని పోలీసులు ఉన్నతాధికారుల తీవ్రంగా పరగణించి నిందితుడు రత్న విలాస్ కోసం తీవ్రంగా గాలించారు. అతని సన్నిహితుల కాల్‌డేటా ఆధారంగా మహారాష్ట్ర వైపు పరారైనట్లు గుర్తించారు. జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందాన్ని మహారాష్ట్రకు పంపించారు. నిందితుని కోసం గాలిస్తుండగా ముంబైలోని చండీవాలీ ప్రాంతంలో అరెస్టు చేసి చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తున్నారు.

చార్‌ధామ్ యాత్రకు వెళ్లి.. అనంత లోకాలకు

- గుండెపోటుతో వ్యాపారి మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

హుజూరాబాద్ : చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన ఓ వ్యక్తి గుండెపోటుతో మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెద్ద పాపయ్యపల్లి గ్రామానికి నార్ల కృష్ణమూర్తి (70) పట్టణంలో 40 ఏళ్లుగా ఆయిల్ మిల్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బద్రీనాథ్ కేదార్‌నాథ్ అమర్నాథ్ తదితర పుణ్యక్షేత్రాలు సందర్శించుకునేందుకు ఈనెల 25న కృష్ణమూర్తి ఇతర యాత్రికులతో కలిసి వెళ్లారు. అక్కడ తీవ్ర అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గురువారం పార్థివదేహాన్ని స్వగృహానికి తీసుకురానున్నారు.

వాహనం ఢీకొని గేదెలు మృత్యువాత


కళేబారాలు తరలిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణ పరిధిలోని పూసాల సమీప రాజీవ్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృత్యువాత పడ్డాయని మున్సిపల్ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. రైతు ఇంట్లో నుంచి బయటకు రాగానే అటుగా వెళ్తున్న వాహనం ఢీకొందని పేర్కొన్నారు. గేదెల కళేబరాలతో దుర్వాసన వస్తోందని స్థానికులు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో క్రేన్‌సాయంతో కార్మికులు కళేబరాలను లారీలో శ్మశానవాటికకు తరలించి పూడ్చివేశారు.

‘న్యాయ సంహిత’పై కసరత్తు

- పోలీసులకు నాలుగు రోజుల శిక్షణ
- ఐపీసీ సెక్షన్ల నంబర్లలో మార్పులు
- జూలై ఒకటి నుంచి అమలు


శిక్షణ పొందుతున్న పోలీసులు(ఫైల్)

కోరుట్ల: మరో నెలరోజుల వ్యవధిలో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) స్థానంలో అమల్లోకి రానున్న భారతీయ న్యాయ సంహితపై పోలీసులు కసరత్తు ప్రారంభించారు. నాలుగు రోజులుగా జిల్లాకేంద్రంలో జిల్లాలోని వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులకు శిక్షణ మొదలెట్టారు. ఐపీసీ సెక్షన్ల నంబర్లతోపాటు శిక్ష, జరిమానాల్లో బీఎన్ఎస్ ప్రకారం కొంత మార్పులు చోటు చేసుకున్నాయి. పోలీసు శాఖ తరచూ నమోదు చేసే కేసులకు సంబంధించిన సెక్షన్ నంబర్లలో వచ్చిన మార్పులతోపాటు ప్రతీ కేసుకూ నూతనంగా అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఎలా ఉపయోగించుకోవాలన్న విషయంలోనూ అవగాహన కల్పిస్తున్నారు.

సెక్షన్ నంబర్లు.. శిక్షల్లోనూ మార్పులు

కొత్తగా రూపొందించిన భారతీయ న్యాయ సంహిత నేపథ్యంలో ఐపీసీ ప్రకారం గతంలో 511 సెక్షన్లు ఉండగా.. ప్రస్తుతం బీఎన్ఎస్ ప్రకారం వాటిని 358కి కుదించినట్లు సమాచారం. బ్రిటిష్ కాలంలో రూపొందించిన ఐపీసీలో ఉన్న కొన్ని సెక్షన్లు ప్రస్తుత సమకాలీన పరిస్థితులకు అవసరం లేదని భావించిన క్రమంలో ఈ మార్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఐపీసీ 302 సెక్షన్ బీఎన్ఎస్ ప్రకారం 103 నంబర్‌గా మార్పు చేశారు. సాధారణంగా ఎవరైనా కొట్టుకున్న కేసు ఉండే ఐపీసీ కింద 324 సెక్షన్ కింద కేసు నమోదు చేసేవారు. ఇప్పుడు బీఎన్ఎస్ ప్రకారం కొట్టుకుంటే 118 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయనున్నారు. ఈ కేసులో రూ.5వేలు జరిమానా ఉండగా తాజాగా రూ.20వేలు దాకా వేయొచ్చు. బహిరంగంగా మద్యం తాగిన కేసులో జరిమానా ఇదివరకు రూ.200 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.500కు పెంచారు. అదే రీతిలో రోడు ప్రమాదంలో హిట్ రన్ కింద నమోదైన కేసుల్లో నిందితులకు గతంలో మూడేళ్ల జైలు శిక్షకు అవకాశం ఉండగా బీఎన్ఎస్ ప్రకారం ఐదేళ్ల వరకు శిక్ష వేయవచ్చు.

ప్రతి కేసుకూ సాంకేతిక సాక్ష్యాలు

ప్రతి కేసులో ఇదివరకు కేవలం రాతపరమైన ధ్రువపత్రాలు, నిందితులు నేర అంగీకారం తెలిపే కాగితాలు, వాటిపై వారి సంతకాలు సేకరించి కోర్టుకు సమర్పించడం ఆనవాయితీగా ఉండేది. ప్రస్తుత కాలంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని పంచనామాలకు సైతం వీడియో సాక్ష్యాలు, నిందితుల నేర అంగీకరణకు వీడియో రికార్డులు చేయాల్సిన అవసరాన్ని పోలీసు శిక్షణలో తెలియజేస్తున్నారు. పెరుగుతున్న సైబర్ నేరాల పరిష్కారాల్లో ఎలక్ట్రానిక్ సాంకేతిక పరికరాల ఆధారంగా పరిశోధన సాగించి కేసులను త్వరితగతిన పక్కా సాక్ష్యాలతో నిరూపించేలా పోలీసులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ అంశాలపై ప్రతి జిల్లా నుంచి వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న సుమారు పది మంది పోలీసు అధికారులకు ఇదివరకే హైదరాబాద్ పోలీసు అకాడమీలో శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన అధికారులు ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితలో జరిగిన మార్పులపై జిల్లా పోలీసులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. జూలై ఒకటో తేది నుంచి నేరాల నమోదు పరిష్కార విధానాలు భారతీయ న్యాయ సంహిత ప్రకారం కొనసాగనున్నట్లు శిక్షణ పొందుతున్న పోలీసులకు ఉన్నతాధికారులు చెబుతున్నారు.